


1న పెన్షన్ల పంపిణీ: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: అక్టోబర్ నెల ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దనే పెన్షన్ల పంపిణీ జిల్లాలో 2,66,342 మందికి సుమారు రూ.112.71కోట్లు పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్యం, వితంతు, చేనేత, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలకు, మత్స్యకారులకు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులకు, చర్మకారులకు, ట్రాన్స్‌జెండర్స్, డప్పు కళాకారులకు రూ.3వేల నుంచి రూ.4వేల వరకు పెన్షన్ పెంచినట్లు తెలిపారు. వికలాంగుల పెన్షన్లు రూ.3వేల నుంచి రూ.6వేల వరకు, డిఎం హెచ్ఓ పెన్షన్లు రూ.5వేల నుండి రూ.10వేల వరకు పెంచినట్లు తెలిపారు. శాశ్వత వికలాంగులకు రూ.5వేల నుంచి రూ.15వేల వరకు పెంచినట్లు తెలిపారు. పెన్షన్లను 1వ తేదీన ఉదయం 6 గంటల నుండే లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి సచివాలయం సిబ్బంది 1,3వ తేదీలలో మాత్రమే పంపిణీ చేస్తారని తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు అందరూ 1వ తేదీననే తమ ఇంటి వద్ద అందుబాటులో ఉండి పెన్షన్ తీసుకోవాలన్నారు.

శ్రీవారిమెట్టు వద్ద 'చిరుత'

- భయందోళనలో భక్తులు

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: శ్రీనివాస మంగాపురం సమీపంలోని శ్రీవారిమెట్టు వద్ద చిరుత పులి కలకలం సృష్టించింది. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో చిరుత రావడంతో కుక్కలు అరుస్తూ వెంబడించాయి. చిరుతపులి వాటిపై దాడి చేయడానికి పరుగెత్తడంతో కంట్రోల్ రూమ్ వద్ద ఉన్న సెక్యూరిటీ గార్డు దీపక్ అప్రమత్తమయ్యాడు. కంట్రోల్ రూమ్‌లోకి వెళ్లి తాళాలు వేసుకున్నాడు. శ్రీనివాస మంగాపురం నుంచి శనివారం ఉదయం 5 గంటలకు భక్తులను శ్రీవారిమెట్టుకు వదిలారు. అదే సమయంలో గార్డు దీపక్ గది నుంచి బయటకు వచ్చి టీటీడీ సెక్యూరిటీ, అటవీ శాఖ అధికారులకు చిరుత గురించి సమాచారమిచ్చాడు. తర్వాత కాలి నడక భక్తులను గుంపులు, గుంపులుగా వదిలారు. శ్రీవారి మెట్టు సమీపంలో పులి సంచారంతో భక్తులు భయందోళనకు గురవుతున్నారు. పెరటాసి మాంసం కావడంతో శ్రీవారి మెట్టు మార్గాన వివిధ రాష్ట్రాల నుంచి కాలినడకన భక్తులు తిరుమలకు చేరుకుంటున్నారు. ఈ దశలో ఏ టైం లో ఏం జరుగుతుందోనని భక్తులు భయందోళన చెందుతున్నారు. పులి సంచరించిందని విషయం తెలుసుకున్న అధికారులు భక్తులకు గుంపులు గుంపులుగా తిరుమలకు వెళ్లాలని సూచిస్తున్నారు. కానీ భక్తులు మాత్రం శ్రీవారి భక్తులకు పులి భయం తొలిగేటట్లు టిటిడి అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



సిసి కెమెరాకు చిక్కిన చిరుత వృత్తంలో

విభిన్న కోణాల్లో దర్యాప్తు..

- లడ్డు కేసు ప్రాధమిక దశలోనే ఉంది..
- తిరుపతిలో మీడియాతో 'సిట్' చీఫ్ త్రిపాఠి




తిరుపతిలో మీడియాతో మాట్లాడుతున్న సిట్ చీఫ్ త్రిపాఠి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల లడ్డులో కల్తీ నెయ్యిపై అందిన ఫిర్యాదులో విభిన్న కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నామని సిట్ చీఫ్ సర్వశ్రేష్ట త్రిపాఠి వెల్లడించారు. లడ్డు వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు కోసం చీఫ్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సిట్ బృందం శనివారం శ్రీవారి దర్శించుకుని, తిరుపతి పద్మావతి అతిథిభవంలో సిట్ చీఫ్ త్రిపాఠి ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఆదివారం ఉదయం పద్మావతి అతిధి గృహంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావుతో ప్రత్యేకంగా 45 నిమిషాలు పాటు సమావేశం అయ్యారు. కల్తీ నెయ్యిపై ఆరా తీశారు. అనంతరం పక్కనే ఉన్న పోలీస్ అతిథి గృహంలో సిట్ బృందం అంతర్గత సమావేశం అయింది. అనంతరం మీడియాతో సిట్ చీఫ్ త్రిపాఠి మాట్లాడారు. లడ్డులో నెయ్యి కల్తీ ఉందని తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందడంతో ఆ కేసును తీసుకుని విచారణ ప్రారంభించామన్నారు. ఈ కేసు ప్రాథమిక దశలోనే ఉందన్నారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేసే తమిళనాడు చెందిన దిండిగల్ ప్రాంతంలోని ఏఆర్ డెయిరీ పైన ప్రధానంగా ఫిర్యాదు అందిందన్నారు. దానిపై మా సిట్‌లోని ఒక బృందం అక్కడికి వెళ్లి విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కేసుకు సంబంధించి తిరుమల, తిరుపతి లోనూ మరో రెండు బందాలు విచారణ కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇందుకోసం మూడు టీములకు ముగ్గురు అధికారులు కూడా విచారణ బాధ్యతలను అప్పగించామని చెప్పారు. ఎప్పటికప్పుడు కేసు పురోగతి మీడియాకు తెలియజేస్తామని త్రిపాఠి తెలిపారు.

మద్యం షాపుల్లో 570 మంది 'ఔట్'

- అక్టోబర్ నుంచి నూతన మద్యం పాలసీ
- జిల్లాలో 244 బ్రాందీషాపులు
- రాష్ట్రంలోనే అత్యధికంగా తిరుపతికి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్వాసన (ఔట్) పలకనున్నారు. అక్టోబర్ నుంచి కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రైవేట్‌కు బ్రాందీషాపులను అప్పగించనుంది. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో 570 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. సేల్స్ సూపర్‌వైజర్స్, సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్‌లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఒక్కో బ్రాందీషాపులో నలుగురు ఉంటారు. వీరంతా వైసిపి హయాంలో విధులు చేరిన వారు కావడంతో వీరందరినీ టిడిపి కూటమి ప్రభుత్వం ఇంటికి పంపనున్నట్లు సమాచారం. బ్రాందీషాపుల్లో పనిచేసే ఉద్యోగులు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో, ఆందోళనలకు సమాయత్తం అవుతున్నారు. గతంలో తిరుపతి జిల్లాలో 145 బ్రాందీషాపులు ఉండగా, నూతన మద్యం పాలసీలో 244 దుకాణాలు జిల్లాకు రానున్నాయి. వీటిలో రిజర్వుడ్ 24 ఉండనున్నాయి. ప్రభుత్వానికి పంపిన జనాభా ప్రాతిపదికనే ఈ దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు.

త్వరలో టెండర్లకు ఆహ్వానం

10 వేల మందిలోపు జనాభాఉన్న ప్రాంతాల్లో రూ.50 లక్షలు లైసెన్సు ఫీజుగా చెల్లించాల్సి వుంటుంది. 10 వేలు- 50 వేల మధ్యలో జనాభా ఉంటే రూ.55 లక్షలు, 50 వేలు- 5 లక్షల మధ్యలో ఉన్నచోట రూ.65 లక్షలు, 5 లక్షల మందికి పైగా ఉన్న ప్రాంతాల్లో రూ.85 లక్షల ఫీజుగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఫీజును ఏడాదిలోపు ఆరు విడతల్లో చెల్లించేందుకు వ్యాపారులకు వెసులుబాటు కల్పించారు. ఏటా 10 శాతం పెంచుతారు. ఇందుకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ఒకట్రెండు రోజుల్లో విడుదల కానుంది. మద్యం దుకాణాలు సొంతం చేసుకునేందుకు చాలామంది రాజకీయ నాయకులు ఆసక్తి చూపుతున్నారు.

బధిరుల సంక్షేమానికి కృషి చేస్తాం..

ఏడి శ్రీనివాస్



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: బధిరుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం తిరుపతిలోని స్థానిక రాస్ భవనంలో అంతర్జాతీయ బధిరుల సంజ్ఞల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడి శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంజ్ఞల దినోత్సవం నిర్వహిస్తున్నామని, బదిరుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. పింఛన్ల పంపిణీ, వినికిడి యంత్రాలు, చదువుకొనే విద్యార్థులకు టచ్‌ఫోను, లాప్టాప్, హియర్ అండ్ స్పీచ్ థెరఫీ, స్వయం ఉపాధి కొరకు రుణాలు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు బధిరులు ఇచ్చిన ఫిర్యాదులను తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తామని, మరికొన్ని అంశాలను కలెక్టర్ ద్వారా ప్రభుత్వాన్నికి నివేదించి పరిష్కరించేలా చూస్తామన్నారు. అనంతరం కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమశాఖ పర్యవేక్షకులు బి.వినోద్ ఆధ్వర్యంలో మనోజ్ కుమార్ ప్రెసిడెంట్ తిరుపతి జిల్లా బధిరుల సంఘం, వైస్ ప్రెసిడెంట్ కళ్యాణ్ చక్రవర్తి, జనరల్ సెక్రెటరీ రెడ్డెప్పరెడ్డి, ట్రెజరర్ సుబ్బారాయుడు, మాధవ్, అధ్యక్షులు తిరుపతి జిల్లా విభిన్న ప్రతిబావంతుల సంగం, సి.యువరాజ్, డైరెక్టర్, రాస్ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేద్దాం..

దీక్షకు మద్దుతు ఇవ్వండి: ఎమ్మెల్యే ఆరణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ 3వ తేదీ తిరుపతి పర్యటనను విజయవంతం చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారంకో ప్రైవేట్ హోటల్‌లో జరిగిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రపంచవ్యాప్తంగా హిందువులకు ఆరాధ్య దైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాల్లో వాడే నెయ్యిని జంతుకొవ్వు, పంది కొవ్వు, చేపల నూనె కలగలిపి అపచారం చేసిందని ఆయన ఆరోపించారు. గత ప్రభుత్వ పాలనలో శ్రీవారికి జరిగిన అపచారాన్ని మన్నించాలని ప్రాయశ్చిత్త దీక్షను పవన్ కళ్యాణ్ చేపట్టారని తెలిపారు. తిరుమలలో ప్రాయశ్చిత్త దీక్ష విరమించేందుకు 1వ తేదీ సాయంత్రం 3 గంటలకు రేణిగుంట విమానాశ్రయంకు పవన్ కళ్యాణ్ చేరుకుని 4 గంటలకు అలిపిరి పాదాల మండపం చేరుకుని పూజలు నిర్వహించిన తరువాత నడక మార్గాన తిరుమలకు చేరుకుంటారని తెలిపారు. 2వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారిని దర్శించుకోనున్నారని, అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్‌ను పరిశీలించనున్నట్లు చెప్పారు. 3వ తేదీ సాయంత్రం 3గంటలకు వారాహి బహిరంగసభకు తిరుమల నుంచి బయలుదేరి సభాస్థలికి చేరికుంటారని ఆయన చెప్పారు. ఈ సభను విజయవంతం చేసేందుకు జనసైనికులు, వీర మహిళలు, పవన్ కళ్యాణ్ అభిమానులు ప్రతిఒక్కరూ హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, రాయలసీమ జనసేన కో కన్వినర్ రాందాస్ చౌదిరి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక, భిక్షాటన రహిత తిరుమలగా తీర్చదిద్దుదాం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్

ప్రజాశక్తి- తిరుమల

తిరుమలలో బాలకార్మికులు, భిక్షాటన లేకుండా సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు త్రిపర్ణ ఆదిలక్ష్మి, బత్తుల పద్మావతి పేర్కొన్నారు. తిరుమలలో ముఖ్యమైన వీధుల్లో దుకాణాల్లో, హోటల్స్‌లో బాలకార్మికులను, భిక్షాటన చేస్తూ ఉన్న బాలలను గుర్తించడం వారి ఈ పరిస్థితులకు గల కారణాలపై ఆరా తీయడం జరిగింది. వీరిలో ఎక్కువగా తమిళనాడు కొంతమంది కర్ణాటక, ఒడిస్సా నుండి వచ్చినట్టు గుర్తించడం జరిగింది. ముఖ్యంగా బాలలతో పూసలు బొమ్మలు మొదలగు ఆట వస్తువులు తల్లిదండ్రులతో కలిసి అమ్మకాలు చేస్తున్నారని అన్నారు. షాపు యజమానులతో సమావేశమై చర్చించి బాలలను పనిలో పెట్టుకుంటే శాఖాపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



తిరుమలలోని వీధుల్లో భిక్షాటన చేస్తున్న బాలలతో మాట్లాడుతున్న కమిషన్ సభ్యులు

కొంతమంది విద్యను మధ్యలో వదిలివేసి బాలకార్మికులుగా, భిక్షాటన చేసేవాళ్ళను గుర్తుంచి వారికి కౌన్సెలింగ్ చేసి మళ్ళీ తిరిగి పాఠశాలల్లో, పునరావాస కేంద్రాలలో ప్రవేశించడానికి కొంతమంది తల్లిదండ్రులు అంగీకరించేలా మాట్లాడారు. చంటిపిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలు గురించి ఆరా తీయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి శివకుమార్ ,విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మరణం వెనుక

ఎలాంటి కుట్ర లేదు: సిపిఎం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: సీతారాం ఏచూరిని బ్రతికించటానికి ఢిల్లీ ఎయిమ్స్‌లో వైద్యులు శక్తికొలది ప్రయత్నించారని, అయినా దురదృష్టవశాత్తు అన్ని ప్రయత్నాలు విఫలమై ఆయన మరణించారని సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో తెలిపారు. సీతారాం ఏచూరికి సరైన వైద్యసౌకర్యం అందకుండా బిజెపి నాయకత్వం కుట్రపూరితంగా వ్యవహరించిందని మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నాయకులు చింతా మోహన్ చేసిన ప్రకటనను సిపిఎం ఖండిస్తున్నదని తెలిపారు. నిన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎయిమ్స్‌లో చేరినందునే మరణించారని చెప్పడం వాస్తవం కాదని, ఎయిమ్స్ ఒక ప్రభుత్వరంగ ఆసుపత్రి అని దేశంలోనే ఉన్నత శ్రేణికి చెందిన వైద్యులు అక్కడ ఉన్నారని ఆయన అన్నారు. చింతా మోహన్ ప్రకటన ఎయిమ్స్ ప్రతిష్టను దిగజార్చే విధంగా ఉందని హాస్పిటల్లోని వైద్యులు చివరి వరకు ఆయనను కంటికి రెప్పలా చూసుకున్నారని, ఉన్నత స్థాయిలో వైద్యుల బృందాన్ని నియమించారని తెలిపారు. పార్టీ కేంద్ర నాయకత్వం అన్ని రోజులు అటు వైద్యులతోనూ, ఇటు సీతారాం కుటుంబ సభ్యులతోనూ పూర్తిస్థాయిలో సమన్వయం చేసిందని వివరించారు. చింతామోహన్ చేసిన ప్రకటనకు ఎటువంటి ప్రాతిపదిక లేదని అన్నారు. డాక్టర్లకు దురుద్దేశాలు అంటగట్టే ఆయన ప్రకటనను సిపిఎం తిరస్కరిస్తున్నదని నాగరాజు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

'హిందువుల మనోభావాలతో జగన్ ఆడుకుంటున్నాడు '

మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ. వెంకటేష్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి తనపై వచ్చిన అభియోగాలను ఎందుకు పోగొట్టుకోవడం లేదు, హిందువుల మనోభావాలతో జగన్ ఇంకా ఆడుకుంటున్నాడని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ.వెంకటేష్ విమర్శించారు. తిరుపతిలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి నాస్తికుడు, వైవి.సుబ్బారెడ్డి సతీమణి అన్యమతస్తురాలు అని, అన్యమతస్తులను ఎందుకు టిటిడి ఛైర్మన్లుగా నియమించారని ప్రశ్నించారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలవడంపై హిందు సమాజం ఆగ్రహంతో ఉందన్నారు. వైసిపి హయాంలో టిటిడిలో గత ఐదు సంవత్సరాలలో అనేక అవకతవకలు జరిగాయని, జగన్ ఎందుకు డిక్లరేషన్‌పై రార్ధాంతం చేశాడని విమర్శించారు. నెయ్యి వ్యవహారంలో కచ్చితంగా నేరస్తులు శిక్షింపబడతారని, పొట్టి శ్రీరాముల పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి మార్చి వేసి సురవరం ప్రతాపరెడ్డి పేరును పెట్టాలన్న తెలంగాణ కేబినెట్ తీర్మానం శోచనీయమన్నారు. భాషా ప్రయుక్త రాష్టాల కోసం ప్రాణత్యాగం చేసిన వ్యక్తి పొట్టి శ్రీరాములు, అలాంటి వ్యక్తి పేరును మార్చాలను కోవడం మంచి పద్ధతి కాదన్నారు. పొట్టి శ్రీరాముల పేరును మార్చడాన్ని వెంటనే ఉప సహారించుకోవాలి, సురవరం ప్రతాప్ రెడ్డి పేరును మార్చాలనుకుంటే ఇంకో సంస్థకు పెట్టుకోండని సూచించారు. నామినేటెడ్ పోస్టులకు తాను అనర్హుడని, గవర్నర్‌గా పనిచేయాలన్న ఆలోచన తనకు లేదని మీడియా ముఖంగా వెల్లడించారు.

విజయభారతి మరణం తీరని లోటు




ప్రజాశక్తి- తిరుపతి సిటీ: ప్రముఖ రచయిత్రి విజయభారతి మరణం తీరని లోటని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య పాల్గొని అన్నారు. ఆదివారం ఎంఆర్‌పల్లిలోని ఆర్‌పిఐ కార్యాలయంలో విజయభారతి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రచయిత్రి విజయభారతి స్త్రీల హక్కుల ఉద్యమ నేత, కుల నిర్మూలన కోసం అనేక రచనలు రచించమే కాకుండా లోతైన పాండిత్యంతో రామాయణము, మహాభారతం, పురాణాలను నిశితంగా పరిశోధించి అందులో స్త్రీలు, దళితులు అణచివేతను తన రచనల ద్వారా వెలుగెత్తి చాటిన రచయిత అన్నారు. ఈమె రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ, జ్యోతిరావు పూలే జీవిత చరిత్రల పుస్తకాలు ప్రజాబహుళయ్య పొందాయన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగులో డాక్టరేట్ పొందిన మొట్టమొదటి మహిళా విజయభారతి అని ఆమెకు పలు సాహిత్య అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం.ప్రసాదరావు, దళిత హక్కులపోరాట సమితి జిల్లా అధ్యక్షులు చిన్నం కాయళయ్య, ఆర్‌పిఐ జిల్లా అధ్యక్షులు ఏ. సుబ్రహ్మణ్యం, వేమన విజ్ఞాన సభ్యులు నడ్డి నారాయణ, బుద్ధవిహార్, అధ్యక్షులు మునిరత్నం, సభ్యులు పి.కృష్ణయ్య, రాజమాణిక్యం, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.

'ఆయన' రూటే సప'రేట్'

- కూటమి నేతలను కలుపుకోని 'ఆరణి'
- పవన్ చెంతకు పంచాయితీ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు రూటే సపరేట్‌గా ఉంది. 'ఏరు దాటక ముందు ఓడమల్లన్న.. ఏరుదాటాక బోడిమల్లన్న' అన్న చందంగా ఆయన తీరు ఉంది. చిత్తూరులో వైసిపి వద్దంటే తిరుపతికి రాజకీయ వలసొచ్చిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల సమయంలో తాను ఎంఎల్ఎ అయితే మీరంతా అయినట్లే అంటూ ప్రతి ఒక్కరి ఇంటికి వెళ్లి కాళ్లావేళ్లా పడి జనసేన ఎంఎల్ఎ అయిపోయారు. గెలిచిన తరువాత ఆయన అసలు స్వరూపాన్ని కూటమిలోనూ చూపిస్తున్నారు. ప్రభుత్వ అధికారులపైనా అజమాయిషి ఎక్కువయ్యిందన్న విమర్శలున్నాయి. ప్రజలకు ఏ సమస్య వచ్చినా అధికారుల దగ్గరకు వెళ్లి, ఫస్టు ఎంఎల్ఎను కలిసి రండి అని చెబుతుండటం గమనార్హం. సూడో ఎంఎల్ఎలను ప్రోత్సహిస్తూ, ఎన్నికల్లో ఖర్చు చేసిన డబ్బును పోగేసుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారని స్వయానా ఆ పార్టీ నేతలే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరణి శ్రీనివాసులు అన్న కొడుకు ఆరణి శివకుమార్‌ను చిత్తూరుకు పంపించేయాలని అధినేత పవన్‌కల్యాణ్ హుకుం జారీ చేసి ఉన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎంఎల్ఎ శ్రీనివాసులు కూటమి నేతలను కలుపుకుని పోవడం లేదని టిడిపి తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి నరసింహయాదవ్, జనసేన జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ మూడో దఫా ఎంఎల్ఎ తీరుపై అధినేత పవన్‌కల్యాణ్ వద్ద పంచాయితీ పెట్టనున్నారు. అక్టోబర్ 1-3 తేదీల్లో పవన్‌కల్యాణ్ తిరుపతికి రానున్న నేపథ్యంలో ఈ పంచాయతీపై చర్చించి చక్కదిద్దే అవకాశం ఉందని శ్రేణుల్లో చర్చ నడుస్తోంది.



శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ చంద్రచూడ్



ప్రజాశక్తి- తిరుపతి సిటి: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై.చంద్రచూడ్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన జస్టిస్ డివై.చంద్రచూడ్‌కు టిటిడి ఈవో శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం టీటీడీ ఈవో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సివిఎస్వో శ్రీధర్, డెప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి సాదర వీడ్కోలు

భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణమైన ఆయనకు సాదర వీడ్కోలు లభించింది. జస్టిస్ పి.కష్ణమోహన్, జస్టిస్ వై.లక్ష్మణరావు, జస్టిస్ రాఘవ స్వామి, జస్టిస్ రామకృష్ణ, జడ్జి ఈ.భీమారావు, ప్రోటోకాల్ ఆఫీసర్ గురునాథ్, జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ప్రోటోకాల్ మెజిస్ట్రేట్ పి.కోటేశ్వరరావు, సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు సాదర వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.



రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు తెలిపిన న్యాయమూర్తులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని బాలాజీ నగర్ ప్రగతి సేవాసంస్థ కార్యాలయంలో పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. పొనకా ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొనకా మల్లికార్జునరెడ్డి దాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతినెలా పేదలకు సరకులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీనివాసులు, పెంచలయ్య, నాగరాజు, మునిప్రసాద్, రాదయ్య, కృష్ణా, విజయ కుమార్, నాగేంద్ర సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్జిఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 14, 17, 19 విద్యార్థులకు జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు నిర్వహించారు. దీనిలో గెలుపొందిన క్రీడాకారులు కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలలో పాల్గొంటారని జిల్లా స్కూల్ గేమ్ సెక్రెటరీ ఎస్.బాబు తెలిపారు. ఈ ఎంపిక పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీమన్నారాయణ రెడ్డి, గణేష్, సురేష్, శ్రీధర్, గుర్రప్ప, సురేంద్ర, స్కేటింగ్ కోచ్లు మేనేజర్లు పాల్గొన్నారు.

సోలార్ అభివృద్ధిలో ప్రతిభ చాటిన వెంకటేష్ యాదవ్



ప్రజాశక్తి-కోట: ఢిల్లీలో లీడర్స్ ఆఫ్ భారత్ నిర్వహించిన అవార్డ్లో జి.వెంకటేష్ యాదవ్‌కి అమీషా పటేల్ చేతుల మీదుగా శనివారం గ్రీన్ ఎన్త్రెప్రిమియర్ ఆఫ్ ది ఇయర్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సోలార్ అభివృద్ధిలో తన ప్రాముఖ్యతను చాటి చెప్పి అవార్డును కూడా గెలుపొందారు. ప్రస్తుతం ఢిల్లీలో తీసుకున్న అవార్డుకు గాను పలువురు జి.వెంకటేష్ యాదవ్‌కు సోలార్ యాజమాన్యం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు



పురస్కారాలను అందిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ ఉపాధ్యాయులకు, పదవ తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. తిరుపతి నగర పరిధిలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆదివారం జరిగిన ఈ ఉత్తమ పురస్కారాల ప్రధానం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై 150 ఉత్తమ ఉపాధ్యాయులకు, పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరచిన 200మంది విద్యార్థులకు పురస్కారాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజం మంచి పయనంలో వెళ్లడానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో కీలకమన్నారు. మారుతున్న విద్యా ప్రమాణాలకు అనుగుణంగా విద్య బోధన చేసి ఉత్తమ పౌరులను సమాజానికి అందించాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో డీఈవో శేఖర్, ఉప విద్యాశాఖ అధికారులు బాలాజీ, ప్రభాకర్ రాజు, అప్స రాష్ట్ర అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, జిల్లా అప్స అధ్యక్షులు డాక్టర్ ఎల్.రమేష్ బాబు, కార్యదర్శి పి.లోకేష్, కోశాధికారి వి.అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


వైభవంగా పవిత్ర సమర్పణ



అభిషేకం చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతంతో మేల్కొలిపి తోమాలసేవ, అర్చన నిర్వహించారు. ఆ తరువాత యాగశాల వైదిక కార్యక్రమాలు, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం వేడుకగా చేపట్టారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, చందనంతో విశేషంగా అభిషేకం చేశారు. ఆ తరువాత పవిత్ర సమర్పణ నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈవో రమేష్, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రికి బెడ్ వితరణ




ఆసుపత్రికి బెడ్డును వితరణ చేస్తున్న దాత

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తిరుపతి అర్బన్ అక్కారం పల్లి పంచాయతీ కొత్తపల్లికి చెందిన జవాజి ఢిల్లీ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవలందించాలని తన పెదనాన్న కొల్లా రెడ్డి పేరుతో అడ్వాన్స్ టెక్నాలజీ కలిగిన సుమారు రూ.30వేలు విలువతో కూడిన బెడ్డును ఆదివారం ఆసుపత్రి సిబ్బందికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా తన వంతు సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అరుణ, డాక్టర్ చంద్రమోహన్, స్టాఫ్ నర్స్ జయమ్మ, ఫార్మసీ సిస్టర్ లలితమ్మ, 108 సిబ్బంది ఈఎంటి చంద్రారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఇంట విషాదం..

- కర్మక్రియలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: "తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పలువురు వైసీపీ నేతల ఇంట విషాదం చోటుచేసుకుంది. సాయినగర్ పంచాయతీ ఎంపీటీసీ శ్రీరాములు రెడ్డి ఇటీవల మరణించడంతో ఆదివారం జరిగిన ఆయన కర్మక్రియలకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు హాజరయ్యారు. శ్రీరాములు రెడ్డి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించిన చెవిరెడ్డి ఆ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే గాంధీపురం పంచాయతీకి చెందిన వైసీపీ నేత మధుసూదన్ రెడ్డి తల్లి గున్నంరెడ్డి సరస్వతమ్మ కర్మక్రియలకు హాజరై ఆ కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం పేరూరు పంచాయతీకి చెందిన ఉప సర్పంచ్ పరందామ రెడ్డి తండ్రి సుబ్రమణ్యంరెడ్డి గత పది రోజుల క్రితం మరణించగా దశ దిన కర్మక్రియలకు హాజరైన చెవిరెడ్డి దంపతులు అంజలి ఘటించారు. అనంతరం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వైసీపీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: మండలంలోని చెంబడిపాలెం గ్రామంలో కమ్యూనిటీ హాల్, రచ్చ బండను ప్రారంభించారు. దాతలుగా ఎన్ఆర్ఐ పల్లిపాటి రమణయ్య, డాక్టర్ అరుణలు వ్యవహరించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చేంబడి పాలెం గ్రామంలో పల్లి పాటి రమణయ్య అమెరికాలో స్థిరపడి, తన గ్రామం కోసం ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు అని కొనియాడారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ ముందు ఉంటున్నారని అన్నారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలందించారు.

అపూర్వ కలయిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - యర్రావారిపాళ్యం: మండలంలోని ఆదర్శ పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. 2015-16సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి విందు ఏర్పాటు చేశారు. పాఠశాలలో తమకున్న అనుభవాలు, జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బీటీ శ్రీదేవి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థితిలో ఉండడం గర్వంగా ఉందన్నారు. ఉన్నత లక్ష్యంతో ఎంచుకొని చదువుల్లో రాణించాలని ఎంఈవో బాలసుబ్రమణ్యం అన్నారు. తమ వంతుగా పాఠశాలకు ఉచితంగా ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను అందజేస్తున్నట్లు పూర్వ విద్యార్థులు తెలిపారు.

నేరాల కట్టడికే కార్డన్ సెర్చ్



పోలీసులు సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: నేరాలను కట్టడి చేసేందుకే పట్టణ, శివారు ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు గూడూరు డీఎస్పీ రమణకుమార్ తెలిపారు. అనుమానిత వ్యక్తుల సంచారంపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. ఆదివారం పట్టణ పరిధిలోని అరుంధతి వాడలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సీఐలు శేఖర్ బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు నేతృత్వంలో సోదాలు చేపట్టారు. రికార్డులు లేని వాహనాలను సీజ్ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు. నేరాల కట్టడికి పోలీసులకు సహకరించాలని కోరారు. సోదాల్లో ఎస్ఐ మనోజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఆదివారం ఎస్ఐ విశ్వనాథ నాయుడు ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీల్లో రికార్డులు సక్రమంగా లేని 8వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు.

గుండె వైద్య శిబిరం విజయవంతం



వైద్య సేవలందిస్తున్న డాక్టర్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రపంచ గుండె దినోత్సవ సందర్భంగా స్థానిక రోటరీ క్లబ్ ఆవరణలో ఎంజీఎం హాస్పిటల్స్, రిపబ్లిక్ క్లబ్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన గుండె వైద్య శిబిరం విజయవంతమైంది. దాదాపు 150 మందికి పైగా రోగులు శిబిరంలో పాల్గొని ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసుకున్నారు. వారికి అవసరమగు మందులు కూడా ఉచితంగా అందజేశారు. గుండె డాక్టర్ వివేక్ చైతన్య పర్యవేక్షణలో శిబిరాన్ని నిర్వహించారు. ఎంజీఎం డైరెక్టర్ గుడ్లూరు మయూర్, రోటరీ క్లబ్ అధ్యక్షులు శైలజ, కార్యదర్శి సిద్దులగారి ప్రసాద్, డాక్టర్ దినేష్, తదితరులు పాల్గొన్నారు.

మాధవికి డాక్టరేట్



మాధవిని అభినందిస్తున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి-క్యాంపస్: ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు విద్య, సామాజిక సేవా రంగంలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేత ఎన్.మాధవికి "గౌరవ డాక్టరేట్"తో సత్కరించారు. అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులతో పాటు ప్రతిష్టాత్మకమైన గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా మాధవిని అప్పుస్మా రాయలసీమ జోన్ అధ్యక్షులు ఎన్.విశ్వనాథ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు గంగయ్య, జిల్లా నాయకులు ఓబుల వెంకటరమణారెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, టీ.వెంకటేశ్వర్లు, భాస్కర్ రాజులు సత్కరించి, అభినందనలు తెలిపారు. వీరితో పాటు గీతాంజలి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పాఠశాల యాజమాన్యం, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఘనంగా ప్రపంచ హృదయ దినోత్సవం




వాకథాన్ కార్యక్రమంలో విద్యార్థులు

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం యూనిట్-4 ఎన్ఎస్ఎస్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన 5కే వాకథాన్‌లో విద్యార్థులు పాల్గొన్నారు. తిరుపతిలోని అమరా హాస్పిటల్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో 300మంది వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ సేతురామ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.చందూలాల్ వంటి ముఖ్య వ్యక్తులు, ఇతర అధికారులు, ప్రొఫెసర్‌లతో పాటు, ఈవెంట్ గ్రాండ్ సక్సెస్‌కు సహకరించారు. ఈ చొరవ గుండె ఆరోగ్యం గురించి అవగాహన పెంచడమే కాకుండా సమాజ సంబంధాలను బలోపేతం చేసిందని చెప్పారు.

తుమ్మలగుంటలో బ్రహ్మోత్సవాలకు శరవేగంగా ఏర్పాట్లు

- దేదీప్యమానంగా విరాజిల్లుతున్న విద్యుత్తు వెలుగులు

- ఉత్సవాల నిర్వహణపై కమిటీలతో చెవిరెడ్డి సమీక్ష



విద్యుత్ దీపాలంకరణతో కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): "తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. అక్టోబరు 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లపై ఉత్సవ కమిటీ సభ్యులతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి ఆదివారం సమీక్ష నిర్వహించారు. తిరుమల తరహాలో స్వామి వారికి, భక్తులకు ఏలాంటి లోటు లేకుండా ఉత్సవాల నిర్వహణ చేపట్టాలన్నారు. ఇందుకోసం ఎవరెవ్వరు ఏఏ పనులు పూర్తి చేయాలన్న బాధ్యతలను కమిటీలకు అప్పగించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంతో పాటు గ్రామంలో చేపట్టవలసిన పుష్పాల అలంకరణ, విద్యుత్తు దీపాలు బ్యారికేడ్లు ఏర్పాటు వంటి పనులతో పాటు పారిశుద్ధ్య పనులు లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామంతో పాటు చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అందరికీ ఆహ్వానం పలికేలా స్వాగత తోరణాలు ఏర్పాటు చేయించాలని సూచించారు. ఉత్సవాలను తిలకించేందుకు వచ్చే భక్తులకు త్రాగునీరు, అన్న ప్రసాదాలు పంపిణీకి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే వాహన సేవల ముందు ప్రదర్శనలు చేసే కళాకారులతో పాటు స్వామి వారి వాహనం మోసే వారికి రుచికరమైన విందు భోజనం అందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో విద్యుత్తు కటౌట్లు ప్రత్యేక అకర్షణగా నిలిచాయి. తుమ్మలగుంట గ్రామం మొత్తం విద్యుత్తు వెలుగులు మధ్య విరాజిల్లుతోంది.

గుండె వ్యాధులపై అవగాహన ర్యాలీ



ర్యాలీ చేపడుతున్న వైద్యులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్రజలకు గుండె వ్యాధుల పట్ల అవగాహన కలిగించేందుకు వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నరిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా స్థానిక లక్ష్మిపురం సర్కిల్ నుంచి గోవిందరాజుస్వామి ఆర్ట్స్ కాలేజి వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి అధినేతలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నిరుపమా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒడిదుడుకుల జీవితంలో మానసిక ఒత్తిడి అధికంగా ఉంటుందని, ఆహారపు అలవాటులో కూడా అనారోగ్యానికి కొత్త కారణం అన్నారు. ప్రతి ఒక్కరు గుండు వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి వ్యక్తికి వాకింగ్ అనేది చాలా అవసరం అని, నడక ద్వారా కొన్ని ఆరోగ్య సమస్యలు పరిష్కారం అవుతాయనిన్నారు. గుండె సమస్యలపై అవగాహన పెంచుకొని, వెంటనే వైద్యుని సంప్రదించి, చికిత్స తీసుకోవడం ఉత్తమమైనది అన్నారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి సుమారు 500 మందికి పైగా ఉచితంగా బీపీ షుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోవిందరావు స్వామి వాకర్ అసోసియేషన్ నాయకులు, వెంకటరమణ ఆర్ట్ అండ్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని బాలుడు మృతి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: తోటి పిల్లలతో సరదాగా ఆటలు ఆడుతున్న ఓ బాలుడుని ప్రమాదవశాత్తు కారు ఢీకొనడంతో ఆ బాలుడు మృతిచెందిన విషాధ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రెండోపట్టణ పోలీసుల వివరాల మేరకు.. స్థానిక వీరారెడ్డిపల్లి ప్రాంతంలో నివాసముంటున్న రవి అనే వ్యక్తి సైదాపురం మండలం పోతేగుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సెలవుదినం కావడంతో రవి అతని కుమారుడు ఓ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న లీలా విన్విత్(11)తో కలిసి స్థానిక ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడామైదానానికి వెళ్లారు. లీలా విన్విత్ తోటి పిల్లలతో సరదాగా ఆటలు ఆడుతున్నాడు. అదే సమయంలో మైదానంలో స్థానిక ప్రశాంతినగర్‌కి చెందిన మెకానిక్‌గా పనిచేస్తున్న వంశీ అనే యువకుడు కారు డ్రైవింగ్ నేర్చుకుంటున్నాడు. ఈ క్రమంలో వంశీ కారును అదుపు చేయలేక వేగంగా వెళ్లి సమీపంలోని ట్రీగార్డును గుద్దుకుంటూ అదుపుతప్పి పక్కనే ఆటలు ఆడుతున్న లీలా విన్విత్‌ను ఢీకొన్నాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన బాలుడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు లీలా విన్విత్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సరదాగా ఆడుకునేందుకు వెళ్లిన బాలుడు ప్రమాదవశాత్తు మృతి చెందడంతో ఆ ప్రాంతంలో విషాధఛాయలు అలముకున్నాయి.

పిల్లల సమగ్ర వికాసానికి తోడ్పడే బిగ్ ఫాంటసీపై చర్చ



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ఐటిసి సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీ ఆధ్వర్యంలో "బిగ్ ఫాంటసీస్ గివ్ వింగ్స్ టు యువర్ ఇమాజినేషన్ (పెద్ద కలలు: మీ ఊహలకు రెక్కలు తొడగండి)" అనే కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ చర్చకు మందిరా బేడి, ప్రకాశ రావు (మాజీ ఇస్రో డైరెక్టర్), డాక్టర్ మేఘా మహాజన్ (డిఎం- నిమ్హాన్స్), రెవ రోహన్ డి అల్మేడా (ప్రిన్సిపాల్, సెయింట్ జోసెఫ్ పాఠశాల) హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్, బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్, ఫుడ్స్ డివిజన్ హెడ్ అలీ హారిస్ షేర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమంతో సాంకేతికతతో కళను మిళితం చేయడం ద్వారా పిల్లలలో సృజనాత్మకత ఊహాశక్తిని పెంపొందించటం బ్రాండ్ లక్ష్యం అని తెలిపారు. కార్యక్రమంలో అంతరిక్ష పరిశోధన, విద్యారంగం, మనస్తత్వశాస్త్రం సృజనాత్మక కళల రంగాలకు చెందిన ప్రముఖులతో "ఇంపార్టెన్స్ ఆఫ్ ఇగ్నైటింగ్ ఏ చైల్డ్స్ ఇమాజినేషన్" (పిల్లల ఊహను ప్రేరేపించడం యొక్క ప్రాముఖ్యత) అనే అంశంపై వివరణాత్మక ప్యానెల్ చర్చ జరిగిందన్నారు. పిల్లల సమగ్ర వికాసానికి కల్పన అనేది ప్రాథమిక అంశంగా ఎలా నిలుస్తుంది, అది సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలను ఎలా పెంపొందిస్తుంది, కొత్త ఆలోచనలను రేకెత్తించడంలో, సవాళ్లను అధిగమించడంలో వారికి ఏ విధంగా సహాయపడుతుందనే అంశాలను ప్యానెల్ చర్చించింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని స్థానిక పురపాలక సంఘం నంది మంగళం గ్రామానికి చెందిన కుమారి మోక్షిత(6) లివర్ వ్యాధితో బాధపడుతుంది. ఈ విషయం తెలిసి ఆమె చికిత్స కోసం పేదవారికి సహాయం చేయాలన్న దృక్పథంతో దాత నగరి మున్సిపాలిటీకి చెందిన థాసన్ అమృత రాజ్ (టిఆర్ఎస్) వారి స్వగ్రామంకు వెళ్లి పేషెంట్‌కి రూ.50వేలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

పింఛన్ పంపిణీ తొలి రోజే 99శాతం పూర్తి చేయాలి

- మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్


ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపల్ పరిధిలో సామాజిక భద్రత పింఛన్‌లను ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అక్టోబర్ 1వ తేది ఉదయం 6:00 నుండి సాయంత్రం 6గంటలలోపు 99శాతం పంపిణీ చేయాలని సచివాలయ సిబ్బందికి, క్లస్టర్ ఇన్చార్జ్‌లకు మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ అదేశాలు జారీ చేశారు. ఇప్పటికే రూట్ మ్యాపింగ్ చేయడం జరిగిందని, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు వారికి కేటాయించిన మార్గాలో అక్టోబర్ ఒకటో తేదీ సాయంత్రం లోపు 99శాతం ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌లను పంపిణీ చేయాలని ఆదేశించారు.

అమిగోస్ బిల్డర్స్ కస్టమర్ మేళాకు విశేష స్పందన



ప్రజాశక్తి-తిరుపతి టౌన్: మధ్య తరగతి ప్రజల చిరకాల ఆకాంక్ష సొంతింటి కల ఆ స్వప్నం నెరవేర్చేందుకు అమిగోస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ యాజమాన్యం అతి తక్కువ ధరలకు అపార్టు మెంట్స్ కస్టమర్ మేళ కార్యక్రమాన్ని శని, ఆదివారాల్లో నిర్వహించిన మేల విశేష స్పందన వచ్చిందని సంస్థ అధినేత అనిల్రెడ్డి తెలిపారు. వినియోగదారులకు అనుగుణమైన ఇళ్లను అతి తక్కువ ధరకే ఇవ్వాలని ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సామాన్య మధ్యతరగతి ప్రజలకు సొంతిల్లు కల నెరవేర్చడానికి అతి తక్కువ ధరతో నాణ్యమైన ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పారు. ప్రజల నుంచి మంచి ఆదరణ వచ్చిందన్నారు తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ సచివాలయం ఎదురుగా అత్యంత సుందరంగా, ఉత్తమ నాణ్యత ప్రమాణాలతో రెడ్వోక్స్ అపార్టుమెంట్స్ సిద్ధమైందన్నారు. ఇందులో క్లబ్స్, స్విమ్మింగ్‌పూల్, జిమ్, పిల్లలకు ఆటస్థలం వంటి సకల వసతులు ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తిగలవారు అపార్టుమెంట్ను సందర్శించాలని కోరారు. బుక్ చేసుకున్న వారికి చదరపు అడుగుపై భారీ తగ్గింపు ఉంటుందని తెలిపారు.

ప్రియాంకకు ఉత్తమ ప్రతిభా పురస్కారం



ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు సన్‌రైస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ చైర్మన్, ఉపాధ్యాయురాలు ప్రియాంక ఉత్తమ ప్రతిభ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి బైరాగపట్టేడిలో జరిగిన ఒక కార్యక్రమంలో తిరుపతి, నగిరి ఎమ్మెల్యేలు ఆరని శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్ సమక్షంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ శేఖర్ ఉత్తమ ప్రతిభా పురస్కారాన్ని ఉపాధ్యాయురాలు ప్రియాంకకు ప్రధానం చేశారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు, పుత్తూరు డిప్యూటీ డిఇఓ ప్రభాకర్ రాజు, సన్ రైస్ హైస్కూల్ కరస్పాండెంట్ సతీష్ తదితరులు హాజరయ్యారు. ఎస్ఎస్సి టాపర్స్ విషయంలో విశేష ప్రతిభ కనబరిచినందుకు సన్‌రైస్ హైస్కూల్ చైర్మన్ ప్రియాంకకు ఈ ప్రతిభ పురస్కారం వరించింది. ఈ నేపథ్యంలో మేమంటో, ప్రశంస పత్రాన్ని ప్రియాంక అందుకున్నారు.

తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు

- అభివృద్ధికి ప్రతి వ్యాపారవేత్త సహకరించాలి

- బిఎన్ఐ ఆధ్వర్యంలో వ్యాపారవేత్తల సమ్మేళనంలో కెవిపి రమేష్



ప్రజాశక్తి-రామచంద్రాపురం(తిరుపతి రూరల్): పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో అంతర్జాతీయ స్థాయిలో వ్యాపారాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని, ఇందుకోసం ప్రతి వ్యాపారవేత్త సహకరించాలని బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిపి రమేష్ అన్నారు. బిఎన్ఐ ఆధ్వర్యంలో అతిపెద్ద వ్యాపారవేత్తల సమ్మేళనం ఆదివారం తిరుపతి నగర పరిధిలోని ఆశా కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. ముఖ్య అతిథిగా బిఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెవిపి రమేష్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కెవిపి రమేష్ మాట్లాడుతూ తిరుపతిని గ్లోబల్ లెవెల్ బిజినెస్ సెంటర్‌గా మార్చడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని కొనియాడారు. ఒకే వేదిక పైన ఇన్ని రంగాలకు చెందిన వ్యాపారవేత్తలు కలవడం గొప్ప అవకాశం అన్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సౌత్ ఇండియాలోని బెంగళూరు, చెన్నై హైదరాబాద్, వైజాగ్ నగరాల నుంచి 750మంది విచ్చేసి వారి వారి వ్యాపారాల గురించి వివరించి, వ్యాపారాల అభివృద్ధి గురించి తెలుసుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు అందజేసి, వ్యాపారవేత్తలు నష్టపోకుండా అందుబాటులో ఉన్న ధరలకు వస్తువులు విక్రయించాలని కెవిపి రమేష్ కోరారు. వ్యాపారాలు చేసి లక్షలు కోట్లు సంపాదించాలని దుర్బుద్ధితో వ్యాపార రంగంలో ఎవరు అడుగు పెట్టరాదని, వినియోదారుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ సరసమైన ధరలకు వ్యాపారాలు చేయాలని ఆయన సూచించారు. భారతదేశ అన్ని రంగాలలో అగ్రగామిగా నిలిచేందుకు వ్యాపారవేత్తలే కృషి చేయాలని కోరారు. భారతదేశంలో ఎన్నో వ్యాపారాలు ఉన్న ప్రజలు మాత్రం విదేశీ మోజులో పడి మన వ్యాపారాలను నిర్లక్ష్యం చేస్తున్నారని దీనిపైన విస్తృత ప్రచారం చేసి ఇండియా తయారు చేసే వస్తువులను కొనుగోలు చేసేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వాలు కూడా సహకరించాలని తెలిపారు. దేశంలో, రాష్ట్రాలలో ప్రభుత్వాలు భారతదేశంలో తయారు చేసే వస్తువులకు ప్రకటన ఖర్చులు తగ్గించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎన్ఐ కన్సల్టెన్సీ చైర్మన్ పార్థ, కో చైర్మన్ సాయికిరణ్, ఈడి సంతోష్, కార్యక్రమం నిర్వాహకులు వంశీకృష్ణ, బి ఎన్ ఐ సభ్యులు తిరుపతి పరిసర ప్రాంతంలోని వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.